క్లుప్తంగా

విద్యార్థులకు పత్రాల అందజేత



పత్రాలతో విద్యార్థులు, నిర్వాహకులు

పరిగి: శ్రీ సత్యసాయి సేవా కేంద్రం రంగాపూర్‌లో సోలిపేట బ్రదర్స్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ తరగతుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సోలిపేట బ్రదర్స్ మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి సేవాకేంద్రం ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటామన్నారు. అందులో భాగంగా వేసవి శిబిరంలో భాగంగా 50 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని సూచించారు. విద్యను నేర్చుకున్నప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సేవా కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

ధారూరు: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజారి కుమార స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో సంజీవ్‌కుమార్, మహాలక్ష్మి దంపతులు పూజలు చేశారు. పంచామృత అభిషేకం, సీతారాముల వారికి అభిషేకం, అలంకరణ నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

16వ మహాసభలను విజయవంతం చేయండి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: సీపీఐ పార్టీ మండల 16వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ పేజ్–2 వద్ద ఈ నెల 10వ తేదీన పార్టీ మండల 16వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నూతన మండల కమిటీని ఎన్నుకోవటంతో పాటు భవిష్యత్తు పార్టీ కార్యాచరణ ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎం.ప్రభులింగం, సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, సత్యనారాయణ, మక్బుల్ పాల్గొన్నారు.

భవానిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన భవానిమాత దేవాలయంలో గత మూడురోజులుగా పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన పూజల్లో బీఆర్‌ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు మాజీ కౌన్సిలర్ బచ్చలి నర్సింలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నాయకులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నారాయణరెడ్డి, గణేష్, నరేందర్, నటరాజ్, అశోక్, విఠల్, దేవేందర్ యాదవ్, శ్రీనివాస్, అనంతయ్య, చింటూ, శేఖర్, శ్రీనివాస్, శ్రీశైలం పాల్గొన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్లు



గుంతలమయంగా చిట్టిగిద్ద రైల్వేస్టేషన్ రోడ్డు

- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

నవాబుపేట: అస్తవ్యస్తమైన రోడ్లతో నవాబుపేట మండలవాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. చాలా కాలంగా బీటీ రోడ్లకు మరమ్మతులు లేకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. కనీసం వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో తరచూ పలు రహదారుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయాలుగా దాపురించాయి.

మూడు కిలోమీటర్లు ఇబ్బంది

మండల పరిధిలోని లింగంపల్లి నుంచి పులుమామిడి వరకు ఉన్న బీటీ రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా మారింది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఆర్కతల చౌరస్తా నుంచి చిట్టిగిద్ద మీదుగా చిట్టిగిద్ద రైల్వేస్టేషన్ వరకు ఉన్న మూడు కిలోమీటర్ల మేర ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా గోతులుగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. చిట్టిగిద్ద రైల్వేస్టేషన్‌కు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు. దీంతో ఉదయం, సాయంత్రం ఈ మార్గం చాలా బిజీగా ఉంటుంది. ఆర్కతల, మీనపల్లికలాన్, మాదారం, నవాబుపేట, ఎత్‌రాజ్‌పల్లి, చిట్టిగిద్ద, పులుమామిడి, కేశవపల్లి గ్రామాల ప్రజలు ఎక్కువగా చిట్టిగిద్ద రైల్వేస్టేషన్‌కు వెళుతుంటారు. అలాంటి ఈ బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మరింత దుర్భరంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

"త్వరలో పూర్తి చేస్తాం

ఆర్కతల చౌరస్తా నుంచి చిట్టిగిద్ద రైల్వేస్టేషన్ వరకు రోడ్డు మరమ్మతుల కోసం రూ.2.70 కోట్లు మంజూరయ్యాయి. అలాగే ఎల్లకొండ నుంచి లింగంపల్లి మీదుగా పులుమామిడి వరకు రూ.3.80 కోట్లు విడుదలయ్యాయి. త్వరలోనే టెండర్లు వేసి, రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేస్తాం.

– ప్రణీత్, పంచాయతీరాజ్ ఏఈ, నవాబుపేట



కంకర దారి.. అవస్థలే మరి

మర్పల్లి: కంకర తేలిన రహదారితో వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని కుదుగంట మీదుగా రావులపల్లి వరకు 4 కిలో మీటర్ల పంచాయతీ రాజ్ రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రోడ్డుపై పాదచారులు నడుచుకుంటూ వెళ్లే సమయంలో వాహనాల టైర్ల కింద నుంచి కంకర ఎగిరి తాకుతుంది. ఇప్పటికే పదుల సంఖ్యలో గాయపడిన ఉదంతాలున్నాయి. కనీసం రహదారిపై మొరం మట్టి వేయాలని కుదుగుంట, రావులపల్లి గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు



బొంరాస్‌పేట: నోట్ పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ హరిలాల్

మోమిన్‌పేట: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను సైతం సర్కారు సరఫరా చేస్తుంది. అందులో భాగంగా మండల వనరుల కేంద్రానికి నోట్ పుస్తకాలు వచ్చాయి. దీంతో ఆయా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నోట్ పుస్తకాలను మండల వనరుల కేంద్రం నుంచి తీసుకు వెళ్తున్నారు. ఎప్పటి నుంచో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందించేవారు. కానీ ఈ సారి నోట్ పుస్తకాలను కూడా పంపిణీ చేస్తున్నారు. ఆదివారం ప్రధానోపాధ్యాయులు మండల వనరుల కేంద్రం నుంచి వాటిని తీసుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేశ్, వీరేశం, మదన్, బాబురావు, హన్మంత్‌రెడ్డి, మండల వనరుల కేంద్రం సిబ్బంది శ్రీనివాస్, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.



మోమిన్‌పేటలో నోట్ పుస్తకాలను తీసుకెళ్తున్న ప్రధానోపాధ్యాయులు

ఒక్కో విద్యార్థికి ఐదు

బొంరాస్‌పేట: ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి హరిలాల్ అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ ఆధ్వర్యంలో ఆదివారం ప్రాథమిక పాఠశాలలకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఒక్కో విద్యార్థికి ఐదు నోట్ పుస్తకాల చొప్పున ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభం రోజున విద్యార్థులకు అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు సోమ్లా, శంకరయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విజయలక్ష్మి, శ్రీహరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య



కోట్‌పల్లిలో అవగాహన ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండలంలోని బస్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ అనంతయ్య పేర్కొన్నారు. ఆదివారం ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మాజీ సర్పంచ్ కూతురును ప్రభుత్వ బడిలో చేర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలను కల్పించారన్నారు. ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు కొనసాగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



దోమ: తన కూతురుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న మాజీ సర్పంచ్ అనంతయ్య

కోట్‌పల్లిలో బడిబాట

బంట్వారం: ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. ఆదివారం కోట్‌పల్లి మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రైవేట్ బడులకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదవరెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణపై అసంతృప్తి

కొడంగల్ రూరల్: రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లింలకు అవకాశం కల్పించలేదని మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం.గౌసన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం విస్తరించిన మంత్రివర్గంలో ముస్లింలకు చోటు కల్పిస్తారనే నమ్మకం ఉన్నా, దాన్ని వమ్ము చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ముదిరాజ్‌ల హర్షం

ధారూరు: మంత్రివర్గ విస్తరణతో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిముదిరాజ్‌కు చోటు కల్పించడంపై ధారూరు ఏఎంసీ వైస్ చైర్మన్ అశోక్, ముదిరాజ్ సంఘం మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల్లో అత్యధికులుగా ఉన్న ముదిరాజ్‌కు మంత్రి పదవి ఇవ్వడం సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు.

వృథాగా భగీరథ నీరు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకులో నుంచి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ట్యాంకు నిండి నీరు గంటల తరబడి వరదలా పారుతున్నా పట్టించుకోకపోవడంతో ట్యాంకు కింద పెద్ద గోతి ఏర్పడింది. దీంతో ఆ గోతిలో నీరు నిండుగా ఉండటంతో చిన్నపిల్లలు స్నానాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగు నీరు వృథా కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మిషన్ భగీరథ నీటిలో స్నానం చేస్తున్న చిన్నారులు

ఘనంగా అపూర్వ సమ్మేళనం



అనంతగిరి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ వివేకవాణి విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1999–2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు చదువుకొని 25 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ నాగయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు తాము చెప్పిన పాఠాలు విధిగా విని నేడు ఉన్నత స్థాయిలో స్థిరపడటం గర్వకారణమన్నారు. అనంతరం పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. నాడు మా ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు, క్రమశిక్షణతోనే నేడు అన్ని విధాలా రాణిస్తున్నామన్నారు. పాఠశాల అభ్యున్నతికి తామంతా పాటు పడుతామన్నారు. అనంతరం ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, సల్మాన్‌రాజ్, నర్సమ్మ, మాణెమ్మ, అనుసూయ, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వేడుక

పూడూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్నప్పటి తీపి గుర్తులను నెమరువేసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, కిషన్, ప్రతాపరెడ్డి, స్వరూపరాణి, శివయ్య, నరహరి, నర్సింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



పూడూరులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సీనియర్ పాత్రికేయుడికి పరామర్శ

షాద్‌నగర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ పాత్రికేయుడు సంజయ్‌కుమార్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నడికూడ యాదగిరియాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు

శంకర్‌పల్లి: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో గత మూడురోజుల నుంచి కొనసాగుతున్న దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు పూర్ణాహుతి, క్షేత్రపాలక బలి, శత కలశాభిషేకం, చక్రతీర్థం, కలశ ఉద్వాసనం, మార్జనం కార్యక్రమాలు తుని తపోవనం పీఠాధిపతి సద్గురు సచ్చిదానంద సరస్వతీ స్వామివారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని, నిత్యం దేవతారాధన చేయాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విపంచి శర్మ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించగా.. పట్టణంతో పాటు, చుట్టు పక్కన గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మూడురోజుల పాటు ఆలయంలో సాత ఆత్మలింగం, జూలకంటి వెంకట్‌రెడ్డి కలిసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో సచ్చిదానంద సరస్వతీ స్వామి ఆలయ కమిటీ సభ్యులు

అన్నదాత ఆగమాగం

- చేతికొచ్చిన పంట నేలపాలు
- మరోవైపు అదును దాటుతుందని విత్తనాలు నాటేందుకు ఆరాటం
- వర్షాలతో అయోమయంలో రైతన్నలు

కొందుర్గు: ఈ ఏడాది ఊహించని రీతిలో ముందస్తు వర్షాలు కురవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. సాధారణంగా రోహిణి కార్తెలో అడపా దడపా వర్షాలు కురిస్తే పొలాలు చదును చేసుకొని మృగశిర, ఆరుద్ర కార్తెలలో విత్తనాలు నాటేవారు. కానీ ఈ ఏడాది రోహిణి కార్తెలో కురిసిన అధిక వర్షాల కారణంగా పొలాలు చదును చేయకపోవడంతో ఇంకా పొలాలు విత్తనాలు నాటేందుకు సిద్ధం కాలేదు. మరోవైపు యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు కూడా కోసి నూర్పిడి చేయడానికి వీలు లేకుండా వర్షాలు పడటంతో ఇంకా కొందరు రైతుల వరి, మొక్కజొన్న పంటలు పొలాల్లోనే ఉన్నాయి. ఇక ఆదివారం మృగశిర కార్తె ప్రారంభమైంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని అదును దాటితే మళ్లీ రాదని పునాస సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు రైతులు పత్తి విత్తనాలు నాటారు. శని, ఆదివారాలు వర్షం కురవడంతో పత్తి విత్తనాలు నాటే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. బైరంపల్లి, ముట్పూర్, రేగడిచిల్కమర్రి గ్రామాల్లో విత్తనాలు నాటారు.

గతేడాది పత్తి, మొక్కజొన్నపై ఆసక్తి

షాద్‌నగర్ డివిజన్‌లోని ఫరూఖ్‌నగర్, జిల్లేడ్ చౌదరిగూడ, కేశంపేట, కొందుర్గు, కొత్తూర్, నందిగామ, తలకొండపల్లి మండలాల్లో ప్రధానంగా వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేస్తారు. ముఖ్యంగా ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో అధికంగా పత్తి, మొక్కజొన్న పంటలను సాగుచేస్తారు. షాద్‌నగర్ డివిజన్‌లో గతేడాది 35 వేల ఎకరాల విస్తీర్ణంలో పత్తి, 46 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగుచేశారు. ఇక వరి 45 వేల ఎకరాలు, కంది 10 వేల ఎకరాలు సాగుచేశారు. అదేవిధంగా రాగులు, కొర్ర, సజ్జ, పెసర, మినుము, పొద్దుతిరుగుడు, నువ్వులు, వేరుశనగ, ఆముదం, చెరుకు తదితర పంటలు సాగుచేశారు. ఇలా మొత్తం దాదాపు 1.40 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగుచేశారు.

మొక్కజొన్న సాగు పెరిగే అవకాశం

గతేడాది పత్తిపంటకు చీడపీడల ఉధృతి పెరిగి, పురుగుల మందుల ఖర్చు పెరగడంతో పాటు పత్తి ధర కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఎకరం పత్తి పంటను సాగుచేస్తే 6 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పత్తి ధర క్వింటాల్‌కు రూ.7వేలు దాటలేదు. దీంతో పత్తి సాగుచేసిన రైతులకు పెట్టుబడులకే సరిపోయింది. దీనికి తోడు కూలీల కొరత రైతులను వేధిస్తోంది. దీంతో ఈ ఏడాది మొక్కజొన్న సాగుపెరిగే అవకాశం ఉందని రైతన్నలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం వరి పంటకు క్వింటాల్‌కు రూ.2,360లు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం రూ.500లు బోనస్ ఇవ్వడంతో వరిసాగు పెరిగే అవకాశం ఉంది. మొక్కజొన్న యంత్రాల సాయంతో సాగుచేయడానికి అనుకూలంగా ఉండటంతో పాటు క్వింటాలుకు రూ.2,400లు ప్రకటించడంతో రైతులు మొక్కజొన్న సాగుచేయడానికి ఆసక్తి చూపుతున్నారు.



బైరంపల్లిలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు



వర్షాల కారణంగా చేతికొచ్చి నేలపాలవుతున్న వరి పంట